క్లుప్తంగా

నేడు గోరంట్ల శ్రీలక్ష్మీమాధవుల కల్యాణం



శ్రీలక్ష్మీ, భూదేవి మాధవస్వామి ఉత్సవమూర్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెలవారితే సోమవారం చిత్తా నక్షత్రయుక్త కుంభలగ్నమందు శ్రీవారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించేందుకు దేవదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం తిలకించేందుకు స్థానిక ప్రజలతో పాటు, జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కల్యాణమనంతరం స్వామి అమ్మవార్ల గరుడోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమంతోత్సవం కార్యక్రమాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ



వాల్మీకి విగ్రహావిష్కరణ చేస్తున్న అతిథులు

కల్లూరు: మండల పరిధిలోని వామసముద్రం గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వాల్మీకి సంఘం నాయకులు కుబేర స్వామి, బేతం కృష్ణుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పిస్తే సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షులు కొల్లాయి పెద్దయ్య, విష్ణు, శేఖర్, చిన్న గోకారి, రంగడు పాల్గొన్నారు.

కాశీనాయన క్షేత్రం పరిశీలన



అర్చకులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కాటసాని

పాణ్యం: వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లోని కాశీనాయన ఆలయానికి చెందిన షెడ్లను అటవీ శాఖ అధికారులు కూల్చివేయడంపై వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన తనయుడు శివనరసింహారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆలయాన్ని సందర్శించి ఆలయ సిబ్బంది, అర్చకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అభీష్టం మేరకు క్షేత్రంలో నిర్మాణాలను దాతల సహకారంతో చేపట్టారన్నారు. నిర్మాణాలను అటవీశాఖ అధికారులు తొలగించడం దారుమన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఆలయంలో పెండింగ్‌లో ఉన్న పనులకు తమ వంతు సహకరిస్తామని తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఎక్స్‌పో



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ శాంతిరాముడు, ఫిరోజ్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్స్‌పో–2025ను చైర్మన్ శాంతిరాముడు, న్యాయశాఖ మంత్రి ఫరూక్ తనయుడు ఫిరోజ్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి ఎక్స్‌పోలు నిర్వహించడం వల్ల మరింత చైతన్యవంతులవుతారన్నారు. ఎక్స్‌పోలో 10 స్టాల్స్‌తో పాటు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎండీ శివరామ్, శాంతిరామ్ ఆస్పత్రి ఎండీ రఘురామ్, డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్స్ జయచంద్రప్రసాద్, సుబ్రమణ్యం, మధుసూదన్‌శెట్టి పాల్గొన్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్

పడకేసిన పారిశుద్ధ్యం

- గోరంట్లలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- జాతర సమీపిస్తున్నా పట్టించుకోని అధికారులు



గోరంట్ల-కోడుమూరు రోడ్డుపై మురుగునీరు



గోరంట్ల తేరుబజార్ ఎదురుగా పేరుకుపోయిన చెత్తచెదారం

కోడుమూరు రూరల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జాతరలలో కోడుమూరు మండలంలోని గోరంట్ల జాతర ఒకటి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12 నుంచి గోరంట్లలో శ్రీలక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. ఈనెల 17, 18 తేదీల్లో జరిగే స్వామివారి కల్యాణం, ప్రభోత్సవంతో పాటు, 20న జరిగే శ్రీవారి రథోత్సవంలో వేలాదిమంది ప్రజలు పాల్గొంటారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన జాతర జరిగే గోరంట్ల గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ప్రధాన రోడ్ల వెంట ఎక్కడ చూసినా భారీగా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా స్వామివారి రథోత్సవం జరిగే తేరుబజార్‌లో భారీగా మట్టి పేరుకుపోవడంతో పాటు, ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు గ్రామంలోని మురుగునీటి కాల్వలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో చాలాచోట్ల రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో గోరంట్ల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



గోరంట్ల - కె.నాగలాపురం రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి అధికారులు మినహా, ప్రజా ప్రతినిధులు మెజార్టీ స్థాయిలో గైర్హాజరుకావడంతో ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పురోగతిని ఏపీఓ కుమార్‌సాయినాథ్ వివరించారు. ఈ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలకు పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సంబంధిత ఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. రైతుల వివరాలను సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ శర్మిలారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కోడుమూరు రూరల్: ఈనెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోడుమూరు ఎంఈఓ తైమూర్‌బాషా సూచించారు. శనివారం ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ఎంఈఓ సమావేశం నిర్వహించి పరీక్షల ఏర్పాట్లపై చర్చించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణ కోసం కోడుమూరులో 6 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను సైతం మూసివేయిస్తున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. గూడూరు మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ సునీలమ్మ శనివారం తెలిపారు. పరీక్షలను సవ్యంగా నిర్వహించేందుకు చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్లు వెల్లడించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

సి.బెళగల్: మండల కేంద్రంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలను అధికారులు పరిశీలించారు. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఎస్‌ఐ తిమ్మారెడ్డి సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను సందర్శించి ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలతో పరీక్షల నిర్వహణపై చర్చించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. మోడల్, గురుకుల ప్రిన్సిపాళ్లు వంశీమోహన్, బలరాముడు, హైస్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు.



సి.బెళగల్ మోడల్ స్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఎస్‌ఐ తిమ్మారెడ్డి

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ఓర్వకల్లు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మండలంలోని ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, సోమయాజులపల్లె, హుసేనాపురం, శకునాల, కన్నమడకల, పూడిచెర్ల, మీదివేముల జెడ్పీ హైస్కూల్‌తో పాటు, కాల్వబుగ్గ గురుకుల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయం, బాలభారతి, బుగ్గరామేశ్వర, కాకతీయ ప్రైవేట్ స్కూల్స్ నుంచి మొత్తం 1123 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు.. 144 సెక్షన్ విధించినట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో హాల్ టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయవచ్చని చెప్పారు.

సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ

- ముగిసిన చెన్నసోమేశ్వరుడి ఉత్సవాలు
- వసంతోత్సవంలో మునిగి తేలిన స్వామి, అమ్మవార్లు
- చక్రస్నానంతో ముగిసిన ఉత్సవాలు



చెన్నసోమేశ్వర స్వామివారికి వసంతోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



సంతాన సాఫల్యం ప్రసాదం పంపిణీ చేస్తున్న పూజారులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వాయంభుగా వెలసిన చెన్నసోమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామి వారి ఉత్సవాలను ఎనిమిది రోజులపాటు భక్తులు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భారీఎత్తున తరలివచ్చిన భక్తులు వేచి ఉండి స్వామివారి ప్రసాదం పొందారు. ప్రసాదం తీసుకున్న వారికి నియమ, నిష్ఠలను అర్చకులు తెలియజేశారు. మధ్యాహ్నం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించి ఆలయ ఆవరణలో ఉత్సవ విగ్రహాలపై రంగులు చల్లి వసంతోత్సవం సంబరంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ కంకణాల వితరణను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం చెన్నసోమేశ్వర, పార్వతి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలను అర్చకులు పల్లకీలో ఉంచి గ్రామంలో మేళతాలాలతో ఊరేగించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలోని అమ్మవారి బావికి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. చక్రస్నానంతో ఉత్సవాల తంతు ముగిసిందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిజేశారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంపై భక్తులు, గ్రామస్తులు, పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న జిల్లా పంచాయతి అధికారి జి.భాస్కర్

పాణ్యం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా స్వచ్ఛాంధ్ర జిల్లా పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. శనివారం కౌలురు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి బయటపడవచ్చని తెలిపారు. అనంతరం వర్మీ యూనిట్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ యూనిట్‌కు పంపాలన్నారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్: గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. సి.బెళగల్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఎంపీడీఓ, మండల అధికారులు, గ్రామ సర్పంచ్ పాండురంగన్న తదితరులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు శుభ్రతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం, బురాన్‌దొడ్డి రోడ్డులో చెత్త తొలగింపు పనులను చేపట్టారు. గ్రామంలో సర్పంచ్ పాండురంగన్న చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను అధికారులు పరిశీలించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దేవ్వెదేవరపాడు గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా పంచాయతి అధికారి జి.భాస్కర్ పాల్గొన్నారు. ఆయన మాట్లడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించి, పునర్వినియోగించదగిన వాటిని ప్రోత్సహించడం అనే అంశంపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించి గ్రామంలో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ఇంటికి రెండు చొప్పున చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కర్నూలు మండల విస్తరణ అధికారి జాకిర్ బాషా, సర్పంచ్ మాధవస్వామి, గ్రామ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు: స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల అధికారులు ఉలిందకొండ గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ అధ్యక్షతన గ్రామ సభ, స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నగేష్, సాంఘిక సంక్షేమ వసతి గృహం వార్డెన్ కల్పన, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరావు, ఎంపీటీసీలు చంద్రకళ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

సి.బెళగల్: తమపై దాడులు చేసి, తీవ్రంగా గాయపరచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలకల్ గ్రామానికి చెందిన బాధితులు ఈరన్న, రామాంజనేయులు, వారి కుటుంబ సభ్యులు ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. పోలకల్ గ్రామానికి చెందిన ఈరన్న అనే యువకుడు శుక్రవారం రాత్రి వీధిలో తెలిసిన వారితో మాట్లాడుతుండగా.. గ్రామానికి చెందిన గంతల కర్రెన్న కుమారులు వచ్చి ఇక్కడెందుకు ఉన్నావని ప్రశ్నిస్తూ దాడి చేశారని, తాను ఇంటికి వెళ్లిన తర్వాత మరోసారి వచ్చి తనతో పాటు అన్న రామాంజనేయులును కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరచారని ఫిర్యాదు చేశారు. నిందితులు గంతల కర్రెన్నతో పాటు ఆయన కుమారులైన మద్దిలేటి, వెంకటప్ప, సోమప్ప, రాజు, వెంకటప్ప కుమారుడు మనోహర్‌పై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.



పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల మధ్య శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు కుమారుడు బోయ సాయకుమార్(25) హైదరాబాద్‌లో పాలీష్ కట్టర్‌గా జీవనం సాగిస్తూ, తల్లితండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఇటీవల స్వగ్రామం ఉయ్యాలవాడకు వచ్చాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిమీద సాయంత్రం బైక్‌పై గ్రామం నుంచి హుసేనాపురం వెళ్లి తిరిగి తిరిగి వస్తుండగా ఉప్పలపాడు గ్రామం వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఓర్వకల్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

గడివేముల: మండలంలోని ఒండుట్ల తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను శనివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు, అంతకు ముందు రంగల్ దర్వేశిఖాద్రి, రంగనాయకులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సీతారాంరెడ్డి, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మురళి మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నంలోపు ఇళ్లకు చేరుకోవాలి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గోందిపర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న పంట కాలువ పూడికతీత పనులను శనివారం మండల ఏపీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలందరూ ఉదయన్నే పనుల్లోకి వెళ్లి 11 గంటల్లోపు పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజు వారీ వేతనం రూ.300 వరకు వస్తుందని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ఎవరి పేరు ఉంటే వారే పనుల్లోకి రావాలన్నారు.

'తమ్ముళ్ల' మధ్య ఆధిపత్యపోరు

- సీసీ రోడ్డు నిర్మాణ విషయంలో ఇరువర్గాల ఘర్షణ
- ఒకరికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పట్టుమని పదినెలలు కాకముందే తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్యపోరు అధికమవుతోంది. శనివారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ తార్కాణంగా చెప్పవచ్చు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ పెద్ద గిడ్డయ్య, బోయ ఎర్రమలకు ఫీల్డు అసిస్టెంట్ విషయంలో విబేధాలు తలెత్తాయి. ఆ సమయంలో పెద్ద గిడ్డయ్యకు గ్రామ టీడీపీ నాయకుడు పరమేశ్వరరెడ్డి, ఎర్రమలకు లక్ష్మిరెడ్డి కొడుకు పుల్లారెడ్డి మద్దతుగా నిలిచారు. ఈ విషయంలో ఎట్టకేలకు పుల్లారెడ్డి బలపరిచిన ఎర్రమల కొడుకు మహేష్‌కు పార్టీ పెద్దలు ఫీల్డు అసిస్టెంట్ పదవిని అప్పగించారు. దీంతో పెద్ద గిడ్డయ్యకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు అప్పగించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్నారు. ఈ పనులను చేపట్టేందుకు పెద్ద గిడ్డయ్య బోయ ఎర్రమల ఇంటి వెనుక భాగంలో కొలతలు వేస్తుండగా ఎర్రమల కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. ఈ విషయంలో ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో ఎర్రమల కొడుకు మహేష్ క్షణికావేశానికి గురై కర్రతో పెద్ద గిడ్డయ్య తలపై మోదాడు. దీంతో గిడ్డయ్య తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేయించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన పెద్ద గిడ్డయ్య

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో చెన్నసోమేశ్వర స్వామి వారి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలో శుక్రవారం పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించిన గ్రామస్తులు, రెండవ రోజు శనివారం కేటగిరీ సైజు వృషభాల బండలాగుడు పోటీలను చేపట్టారు. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి 12 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్ణీత 20 నిమిషాల సమయంలో రైతు సంఘం నిబంధనలకు లోబడి బండను ఎక్కువ దూరం లాగిన ఎద్దులను విజేతలుగా ప్రకటించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు. పోటీలలో నంద్యాల జిల్లా కొత్తకోట గురునాథ్, గద్వాల జిల్లా శనగపల్లి చక్రవర్తి సంయుక్త ఎద్దుల జత రాతిదూళాన్ని 4,706.3 అడుగుల దూరం లాగి విజేతగా నిలవగా తరువాతి స్థానాల్లో గద్వాల జిల్లా మంగపేట గాజుల జయమ్మ వీరాంజనేయుల ఎద్దులు (4705.4 అడుగులు), గద్వాల జిల్లా పచ్చర్ల సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు (4,689 అడుగులు), కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం హెచ్.కై రవాడి లక్ష్మన్న, అనంతపురం జిల్లా తాడిపత్రి రాజశేఖర్‌రెడ్డి బ్రదర్స్ సంయుక్త ఎద్దుల జత (4,677 అడుగులు), కర్నూలు మండలం రేమట నడిపి గిడ్డయ్య, సి.బెళగల్ మండలం ఇనగండ్ల బాయికాటి బోడెన్న సంయుక్త ఎద్దుల జత (4,646.10 అడుగులు) నిలిచాయి. పోటీలకు తిలకించేందుకు వచ్చిన వారికి ఉత్సవ కమిటీ సభ్యులు భోజన సౌకర్యం కల్పించారు. వ్యాఖ్యాతగా వేమారెడ్డి వ్యవహరించారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.



రాతి దూళాన్ని లాగుతున్న వృషభాలు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

గడివేముల: తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛత పాటించాలని ఎంపీడీఓ వాసుదేవగుప్తా, ఈఓపీఆర్డీ మహిధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయా పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంతో పాటు తడి చెత్తతో వర్మీ కంపోస్టు, పొడి చెత్తతో పేపర్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసి సంపద సృష్టించవచ్చన్నారు. కొత్త బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో చెత్త సేకరణకు బుట్టలను పంపిణీ చేశారు.

సమస్యాత్మక పరీక్ష కేంద్రం తనిఖీ

గడివేముల: మండలంలోని సమస్యాత్మకమైన పరీక్ష కేంద్రాలను మండల స్పెషల్ అధికారి జవహర్‌బాబు శనివారం తనిఖీ చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గడివేముల జెడ్పీ పాఠశాల కేంద్రాన్ని సమస్యాత్మకమైన పరీక్ష కేంద్రంగా గుర్తించారన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఎంఈఓ-2 రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానియల్ తదితరులు ఉన్నారు.



జెడ్పీ పాఠశాలలను పరిశీలిస్తున్న అధికారులు